ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
పార్వతీపురం మన్యం
జిల్లా వార్తలు
ఆదివారం 6 జూలై 2025



గురుకులాల్లో మిగులు సీట్ల భర్తీకి కౌన్సెలింగ్

సాలూరు రూరల్, జూలై 5 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలో ఐదు బాలురు, ఎనిమిది బాలికల బీఆర్ అంబేడ్కర్ గురుకులాల్లో ఐదో తరగతి, ఇంటర్ ప్రథమ సంవత్సరంలో మిగులు సీట్ల భర్తీకి ఈ నెల 7న కౌన్సెలింగ్ నిర్వహించనున్నారు. ఈ మేరకు నెల్లిమర్లలో బీఆర్ అంబేడ్కర్ గురుకులానికి విద్యార్థులు హాజరు కావాలని గురుకులాల కో ఆర్డినేటర్ ఎస్.రూపావతి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటలకు బాలికలు, మధ్యాహ్నం ఒంటి గంటకు బాలురు హాజరు కావాలని కోరారు. నాలుగో తరగతి, టెన్త్ పాసైన ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు ఆధార్, ధ్రువీకరణ పత్రాలతో రావాలన్నారు.

సమస్య ఉందా.. స్కాన్ చేసి ఫిర్యాదు చెయ్!

- రేషన్ డిపోల వద్ద క్యూఆర్ కోడ్ పోస్టర్లు
- పారదర్శకంగా సరుకుల సరఫరాకు ప్రభుత్వం చర్యలు

పాలకొండ, జూలై5 (ఆంధ్రజ్యోతి)

ప్రజాపంపిణీ వ్యవస్థలో అక్రమాలకు చెక్ పెట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా క్యూఆర్ కోడ్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. సరుకుల సరఫరాను మరింత పారదర్శకంగా చేపట్టేందుకు ఈ విధానాన్ని అమలు చేస్తోంది. గత వైసీపీ సర్కారు ప్రవేశపెట్టిన ఎండీయూ వాహనాల వ్యవస్థను రద్దు చేస్తూ.. మళ్లీ డిపోల ద్వారా రేషన్ అందజేయాలని ప్రభుత్వ నిర్ణయించిన సంగతి తెలిసిందే. ఈ మేరకు గత నెల నుంచి రేషన్ దుకాణాల నుంచి కార్డుదారులకు నిత్యావసరాల సరుకులు సరఫరా చేస్తున్నారు. అయితే ఇదే సమయంలో ప్రతి రేషన్‌షాపు వద్ద ప్రత్యేక క్యూ ఆర్ కోడ్‌తో కూడిన పోస్టర్లను ఏర్పాటు చేస్తున్నారు. దీని ద్వారా సరుకుల పంపిణీపై ఏమైనా అభ్యంతరాలుంటే వెంటనే ఫిర్యాదు చేయొచ్చు. అధికారులు, కార్యాలయాలు చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా షాపు వద్ద ఉన్న క్యూ ఆర్ కోడ్‌ను స్కాన్ చేసి క్షణాల్లోనే ఫిర్యాదు చేసుకొనేలా ప్రభుత్వం క్యూఆర్ కోడ్‌ను అందుబాటులోకి తెచ్చింది.



పాలకొండలోని ఓ రేషన్‌షాపులో సరుకులు పంపిణీ చేస్తున్న దృశ్యం

జిల్లాలో 578 రేషన్‌షాపులు...

జిల్లాలోని 15 మండలాల్లో 578 రేషన్‌షాపులు ఉన్నాయి. వీటి పరిధిలో 2,20,934 రైస్‌కార్డులు, 55,939 ఏఏవై కార్డులు ఉన్నాయి. వారందరికీ ప్రతి నెలా ఆయా రేషన్ డిపోల ద్వారా నిత్యావసర సరుకులను పంపిణీ చేస్తున్నారు. అయితే రేషన్ పంపిణీలో డీలర్లు అవకతవకలకు పాల్పడకుండా రాష్ట్ర ప్రభుత్వం క్యూఆర్ కోడ్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసి కార్డుదారులు వారి అభిప్రాయాలు, సమస్యలను తెలియజేయొచ్చు. జిల్లా పౌరసరఫరాల శాఖాధికారులు ఆదేశాల మేరకు డీలర్లు జిల్లాలోని అన్ని రేషన్‌షాపుల్లోనూ క్యూఆర్ కోడ్ స్కానర్ పోస్టర్లను అందుబాటులో ఉంచారు.


క్యూఆర్ కోడ్‌తో ఉపయోగాలివీ...

రాష్ట్ర ప్రభుత్వం అమలులోకి తెచ్చిన ప్రత్యేక క్యూ ఆర్ కోడ్ తో ఎన్నో ఉపయోగాలు ఉన్నాయి. రేషన్ డిపో వద్ద ఉన్న క్యూఆర్‌కు స్కాన్ చేయగానే ఈ నెల రేషన్ సరుకులు తీసుకున్నారా.. సరుకుల నాణ్యతపై సంతృప్తిగా ఉన్నారా.. రేషన్ డీలరు **(మిగతా 8వ పేజీలో..)**

అక్రమాల నివారణకే...

రేషన్ డిపోల ద్వారా అందిస్తున్న నిత్యావసర సరుకుల్లో అక్రమాల నివారణకు క్యూఆర్ కోడ్ స్కానర్ ఉపకరిస్తుంది. సరుకుల పంపిణీలో డీలర్లు చేతివాటం ప్రదర్శిస్తే ఈ క్యూఆర్ కోడ్ స్కానర్ ద్వారా లబ్ధిదారులు నేరుగా ఆన్‌లైన్‌లో ఫిర్యాదు చేయవచ్చు. ప్రతి రేషన్ డిపో వద్ద విధిగా వాటి ఫ్లెక్సీలను అందుబాటులో ఉంచాం.

-మారుతీ, సీఎస్‌డీటీ, పాలకొండ



డిపోలో ఏర్పాటుచేసిన క్యూ ఆర్ కోడ్ ఫ్లెక్సీ



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి సంధ్యారాణి

పీ4లో తొలి అడుగు

- పది కుటుంబాలను దత్తత తీసుకున్న మంత్రి సంధ్యారాణి
- వారి ఆర్థిక, సామాజిక అభివృద్ధికి కృషి చేస్తానని వెల్లడి

పార్వతీపురం/సాలూరు, జూలై 5 (ఆంధ్రజ్యోతి): పీ4- మార్గదర్శి బంగారు కుటుంబంలో భాగంగా సాలూరు నియోజకవర్గంలో పది కుటుంబాలను దత్తత తీసుకుంటున్నట్టు గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సంధ్యారాణి ప్రకటించారు. శనివారం సాలూరు ఎంపీడీవో కార్యాలయంలో నియోజకవర్గ కార్యాచరణ ప్రణాళికపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామీణాభివృద్ధి, మౌలిక సదుపాయాల మెరుగుదల, విద్య, ఆరోగ్యం, రవాణా, నీటి సరఫరా, పౌర సేవలపై చర్చించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ..'పేదరిక ఆర్థిక చేయూత అందించాలనే లక్ష్యంతో సీఎం చంద్రబాబునాయుడు పీ4 మార్గదర్శి బంగారు కుటుంబం కార్యక్రమాన్ని అమలు చేస్తున్నారు. పేదరికం నుంచి ఆయా కుటుంబాలను బయటకు తీసుకురావడమే ప్రభుత్వ లక్ష్యం. ముఖ్యమంత్రి పిలుపు మేరకు నియోజకవర్గంలోని 10 కుటుంబాలకు మార్గదర్శిగా ఉంటా. వారికి ఆర్థిక, సామాజిక అభివృద్ధికి పూర్తిగా కృషి చేస్తా. నియోజకవర్గంలో ప్రతి మండలం నుంచి రెండు కుటుంబాలు, సాలూరు మున్సిపాలిటీ నుంచి రెండు కుటుంబాలకు మార్గదర్శిగా ఉంటా.' అని తెలిపారు. ఈ సమావేశంలో డ్వామా పీడీ రామచంద్ర రావు, టీడీపీ నాయకులు పరమేశు, తిరుపతిరావు, వేణుగోపాలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

10న మెగా పేరెంట్స్ టీచర్స్ మీటింగ్

పార్వతీపురం, జూలై 5 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఈనెల 10న మెగా పేరెంట్స్ టీచర్స్ మీటింగ్ (పీటీఎం) జరుగుతుందని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ తెలిపారు. శనివారం కలెక్టరేట్‌లో విలేఖర్లతో ఆయన మాట్లాడుతూ.. 'ప్రజా ప్రతినిధులు, పాఠశాల యాజమాన్య కమిటీలు, టెన్త్‌లో ఉత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులు, పూర్వ విద్యార్థులు తదితరులతో ఈ కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం. ప్రభుత్వ ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలలు తదితర అన్ని మేనేజ్‌మెంట్ విద్యా సంస్థల్లో మెగా పీటీఎం నిర్వహించాల్సి ఉంది. జిల్లాలో 1787 విద్యా సంస్థలు ఉన్నాయి. ఇందులో 1,29,730 మంది విద్యార్థులు చదువుతున్నారు. మెగా పీటీఎంలో భాగంగా ఉదయం 9 గంటల నుంచి కార్యక్రమాలు ప్రారంభమవుతాయి. 11 గంటకు విద్యార్థుల ప్రగతి, పాఠశాలల్లో చేపట్టిన కార్యకలాపాలను తెలియజేస్తారు. తల్లిదండ్రులకు వివిధ క్రీడా పోటీలు నిర్వహిస్తారు. ఆ తర్వాత సమావేశం ఉంటుంది. అతిథులతో పాటు తల్లిదండ్రులు, పదో తరగతిలో ఉత్తమ ర్యాంకులు సాధించిన విద్యారులు, పూర్వ విద్యార్థులు తదితరుల అభిప్రాయాలు తెలుసుకోనున్నారు.' అని తెలిపారు. జిల్లాలో పీటీఎంకు విస్తృత ఏర్పాట్లు చేయాలని మరో వైపు జిల్లా అధికారులను ఆయన ఆదేశించారు. విద్యార్థులు స్కూల్ యూనిఫారం ధరించాలని, సర్వేపల్లి రాధాకృష్ణన్ స్కూల్ కిట్లు ఉండాలని సూచించారు. తల్లిదండ్రులతో పాటు మిగతావారందరికీ భోజనం ఏర్పాట్లు చేయాలన్నారు. ఈ సమావేశంలో ఇంటర్మీడియట్ విద్యాశాఖాధికారి వై.నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

జై జగన్నాథ
- ఘనంగా మారు రథయాత్ర

భక్తిశ్రద్ధలతో మొహర్రం

లోక్ అదాలత్‌లో 116 కేసుల రాజీ 8లో

చంద్రబాబుతోనే సుపరిపాలన
- మంత్రి కొండపల్లి శ్రీనివాస్ 8లో

తొలి ఏకాదశికి తోటపల్లి సిద్ధం

పెంపుడు జంతువులతో జాగ్రత్త 7లో
- నేడు జూనోసిస్ డే



వర్క్‌షాప్‌లో మాట్లాడుతున్న కలెక్టర్

బంగారు కుటుంబాలు 42,817

- కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

పార్వతీపురం, జూలై 5(ఆంధ్రజ్యోతి): జిల్లాలో 42,817 బంగారు కుటుంబాలు ఉన్నాయని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ తెలిపారు. ఈ కుటుంబాలను మార్గదర్శి (గైడ్)తో సమన్వయం చేయాలన్నారు. శనివారం కలెక్టరేట్‌లో సంబంధిత అధికారులకు వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 'ప్రభుత్వం బంగారు కుటుంబాలను ఆన్‌లైన్ ద్వారా ఎంపిక చేసింది. పీ4 కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి నియోజకవర్గస్థాయి వర్క్‌షాప్‌లను జిల్లాలో ఏర్పాటు చేశారు. వివిధ రకాల సహాయక కార్యక్రమాలను మార్గదర్శి సాయంతో అందించడం ద్వారా ఆయా కుటుంబాలను పేదరికం నుంచి బయటకు తీసుకురావడమే పీ4 కార్యక్రమం ముఖ్య లక్ష్యం. కుటుంబం ఒక నిర్దిష్ట స్థాయికి చేరుకునే వరకు సంబంధిత అధికారులు నిబద్ధతతో పనిచేయాలి. కుటుంబ అవసరాలను తెలుసుకోవడానికి సర్వే నిర్వహించాలి. ఇళ్లను మార్గదర్శితో మ్యాప్ చేయాలి. పనిని పర్యవేక్షించడానికి సిబ్బందిలో ఒకరిని కన్వీనర్‌గా నియమించాలి. ఈ కార్యక్రమానికి జాయింట్ కలక్టర్ నోడల్ అధికారిగా ఉంటారు.యోగాంధ్రలో దాదాపు ఐదు లక్షల మంది భాగస్వాములయ్యారు. ఇది గొప్ప విజయం. జిల్లా యంత్రాంగం అదే స్ఫూర్తితో పనిచేసి మెగా పేరెంట్స్ అండ్ టీచర్స్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి.' అని తెలిపారు. అనంతరం జేసీ శోభిక మాట్లాడుతూ పీ-4 వెబ్‌సైట్‌లో మార్గదర్శిగా నమోదు చేసుకోవడానికి ప్రజలు ముందుకు రావాలన్నారు. ఈ సమావేశంలో పార్వతీపురం, సీతంపేట సబ్ కలెక్టర్లు అశుతోష్ శ్రీవాస్తవ, యశ్వంత్‌కుమార్‌రెడ్డి, డీఆర్వో హేమలత తదితరులు పాల్గొన్నారు.

క్యాన్సర్‌పై కదిలిన యంత్రాంగం

- ఫ్యాక్టరీ పరిసరాలు పరిశీలన
- పారదర్శకంగా విచారణ జరపాలని ప్రజల డిమాండ్

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

జియ్యమ్మవలస, జూలై5(ఆంధ్రజ్యోతి): కొమరాడ మండలంలో గంగిరేగువలస, రాజ్యలక్ష్మీపురం పంచాయతీలను క్యాన్సర్ కబళిస్తోందని ఇటీవల 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనంపై కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ స్పందించారు. ఆయన ఆదేశాల మేరకు శనివారం కొమరాడ తహసీల్దార్ సత్యనారాయణ ఆధ్వర్యంలో అధికారుల బృందం రెండు గ్రామాల ప్రజల అభ్యంతరాలను తెలుసుకుంది. కెమికల్స్ వ్యర్థాలను జంఝావతి ప్రాజెక్టు పాత గోడౌన్‌లో నిల్వ చేస్తున్నట్లు గంగిరేగువలస ఎంపీటీసీ సభ్యుడు జి.వెంకటనాయుడు, సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు కొల్లి సాంబ మూర్తి అధికారుల బృందం దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ప్రాజెక్టు ఏఈఈ అభిషేక్ పాత గోడౌన్‌ను శుభ్రం చేయించి అక్కడకు ఎవరూ వెళ్లకుండా దారిలో ట్రెంచ్ కొట్టించారు. సమగ్రంగా విచారణ చేసి వాస్తవాలు నిగ్గు తేల్చాలని, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల ప్రజలు డిమాండ్ చేశారు. అనంతరం అధికారుల బృందం ఆ ప్రాంతంలో ఉన్న ఫ్యాక్టరీ వద్దకు చేరుకుని విచారణ ప్రారంభించింది. అక్కడి పరిసరాలను పరిశీలించింది. అయితే ఫ్యాక్టరీ యాజమాన్యం ప్రజలతో గొడవకు దిగడంతో కొంత ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. దీంతో అధికారుల బృందం వెనుదిరిగింది.



ప్రజలతో మాట్లాడుతున్న అధికారుల బృందం



ఇటీవల 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనం

మలేరియా నియంత్రణకు చర్యలు

- చెరువుల్లో గంబూషియా చేప పిల్లల విడుదల
- డీఎంహెచ్‌వో భాస్కరరావు

పార్వతీపురం, జూలై 5(ఆంధ్రజ్యోతి): జిల్లాలో మలేరియా నియంత్రణే లక్ష్యంగా పనిచేస్తున్నామని డీఎంహెచ్‌వో ఎస్.భాస్కరరావు తెలిపారు. దీనిలో భాగంగా మొదటి విడతగా లక్ష గంబూషియా చేపలను సరఫరా చేశామన్నారు. ఈ మేరకు శనివారం కొత్తవలస చెరువులో ఆ చేపలను విడుదల చేశారు. జిల్లాలో ముందుగా గుర్తించిన 178 చెరువుల్లో గంబూషియా చేపలను విడుదల చేశామన్నారు. చెరువుల్లో ఉన్న దోమల లార్వాలను అవి తిని మలేరియా, డెంగ్యూ నివారణకు ఎంతగానో దోహదపడతాయని తెలిపారు. ఇప్పటికే 915 గ్రామాల్లో ఐఆర్ఎస్ మొదటి దశ స్ప్రేయింగ్ పూర్తి చేశామని, ప్రస్తుతం రెండో విడత జిల్లా వ్యాప్తంగా కొనసాగుతుందని వెల్లడించారు. వైద్య సిబ్బంది ఎప్పటికప్పుడు ఫీవర్ సర్వే చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఈడీఆర్‌బీ ఎస్‌కే జిల్లా ప్రోగ్రాం అధికారి టి.జగన్మోహన్‌రావు, ఏఎంవో సూర్యనారాయణ, కన్సల్టెంట్ రామచంద్ర తదితరులు పాల్గొన్నారు.



చెరువులో చేప పిల్లలను విడిచిపెడుతున్న డీఎంహెచ్‌వో..

పర్యవేక్షణ తప్పనిసరి..

మాతా, శిశు ఆరోగ్యంపై నిరంతరం పర్యవేక్షణ ఉండాలని డీఎంహెచ్‌వో భాస్కరరావు ఆదేశించారు. శనివారం పార్వతీపురం ఎన్‌జీవో హోంలో ఆశా కార్యకర్తలు, నోడల్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఆర్‌సీహెచ్ మాతా శిశు నమోదులో ఏఎన్ఎం, ఆశా కార్యకర్తల పనితీరు విశ్లేషించాలన్నారు. గర్భిణులకు హిమోగ్లోబిన్, షుగర్, బీపీ, క్షయ వంటి పరీక్షలు తప్పనిసరిగా చేయాలని సూచించారు. పీహెచ్‌సీల వారీగా డెలివరీ నివేదికలను ప్రతి నెలా సమీక్షిస్తామన్నారు.

తోటపల్లికి జలకళ

గరుగుబిల్లి, జూలై5(ఆంధ్రజ్యోతి): తోటపల్లి భారీ సాగునీటి ప్రాజెక్టు జలకళను సంతరించు కుంది. జిల్లాతో పాటు ఎగువ ప్రాంతం ఒడిశాలో కూడా జోరుగా వర్షాలు కురుస్తుండడంతో వరద పోటెత్తుతోంది. దీంతో ప్రాజెక్టు పరిధిలోని నాగావళి నదిలో నీటి నిల్వలు ఒక్కసారిగా పెరిగాయి. ప్రస్తుతం ప్రాజెక్టులో 105 మీటర్లకు గాను 104.35 మీటర్ల మేర నీటి నిల్వలు ఉన్నాయి. శనివారం సుమారు 4500 క్యూసెక్కులను స్పిల్‌వే గేట్ల నుంచి దిగువకు విడిచిపెట్టారు. ప్రాజెక్టులో 2.534 టీఎంసీలకు గాను ప్రస్తుతం 2.122 టీఎంసీల నీరు ఉండడంతో ఈ ఏడాది ఖరీఫ్ సాగుకు ఢోకా లేదని అధికార వర్గాలు చెబుతున్నాయి. ఇదిలా ఉండగా తోటపల్లి కుడి ప్రధాన కాలువ నుంచి ఆదివారం సాగునీరు విడుదల చేయనున్నారు. ఉల్లిభద్ర పరిధిలోని జీవో కిలో మీటరు నుంచి 117.89 కిలో మీటరు వరకు నీరు సరఫరా కానుంది. తోటపల్లి నుంచి పార్వతీపురం, బొబ్బిలి, చీపురుపల్లి, నెల్లిమర్ల, రాజాం, ఎచ్చెర్ల నియోజకవర్గాల్లో 333 గ్రామాల పరిధిలోని 1,31,221 ఎకరాలకు సాగునీరు అందనుంది. కాగా ఈ కార్యక్రమానికి మంత్రి గుమ్మిడి సంధ్యారాణితో పాటు ప్రభుత్వ విప్ తోయక జగదీశ్వరి, మూడు జిల్లాల శాసనసభ్యులు, అధికారులు హాజరుకానున్నారు. ఈ మేరకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని ప్రాజెక్టు ఈఈ హెచ్.మన్మథరావు తెలిపారు.



తోటపల్లి స్పిల్‌వే నుంచి దిగువకు నీటిని విడుదల చేస్తున్న దృశ్యం

కచ్చితమైన సమాచారం ఇవ్వాలి

- ఎస్పీ మాధవరెడ్డి

బెలగాం, జూలై 5 (ఆంధ్రజ్యోతి): పోలీస్ శాఖలో కీలకమైన స్పెషల్ బ్రాంచ్ సిబ్బంది కచ్చితమైన సమాచారాన్ని సేకరించి ఇవ్వాలి ఎస్పీ ఎస్వీ మాధవరెడ్డి ఆదేశించారు. శనివారం ఎస్పీ కార్యాలయంలో సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. విధి నిర్వహణలో చేపట్టాల్సిన పనులపై సూచనలిచ్చారు. శాంతి భద్రతల పరిరక్షణలో క్రియాశీలకంగా వ్యవహరించే స్పెషల్ బ్రాంచ్ సిబ్బంది సమాచార వ్యవస్థను మెరుగుపరుచుకోవాలని సూచించారు. రోజు జరిగే విషయాలను భద్రపరుచుకోవాలని తెలిపారు. సమాజంలో జరుగుతున్న అసాంఘిక కార్యక్రమాలు, రాజకీయ వివాదాలు, ప్రముఖ వ్యక్తుల రాకపోకల సమాచారం, ధర్నాలు, భూ తగాదాలు, మత సంబంధమైన గ్రూపుల గురించి ముందస్తుగా తెలుసుకోవాలన్నారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే సంఘటనలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని చెప్పారు. అనంతరం విధి నిర్వహణలో ప్రతిభ కనబరిచిన అధికారులు, సిబ్బందికి ప్రశంసా పత్రాలు అందజేశారు. ఎస్పీ సీఐ రంగనాథం తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ మాధవరెడ్డి

పెంపుడు జంతువులతో జాగ్రత్త

- పొంచి ఉన్న వ్యాధుల ముప్పు
- నేడు జూనోసిస్ డే



సాలూరు రూరల్/ విజయనగరం రింగురోడ్డు/ బొబ్బిలి/ రాజాం/ గజపతినగరం/ జియ్యమ్మవలస, జూలై 5 (ఆంధ్రజ్యోతి): పెంపుడు జంతువులతో మనం ఏర్పరచుకున్న ఆత్మీయత ఎంతో ఉల్లాసాన్ని ఇస్తుంది. మనుషులు.. జంతువుల మధ్య బంధం అపురూపమైనదని చెప్పవచ్చు. అయితే పెంపుడు జంతువుల పట్ల సరైన జాగ్రత్తలు పాటించకపోతే, వాటి నుంచి మనుషులకు వివిధ రకాల వ్యాధులు వచ్చే అవకాశం ఉంది. ప్రేమ పెంచుకోవడం ఎంత అవసరమో.. తగిన జాగ్రత్తలు పాటించడం అంతే అవసరం. పెంపుడు జంతువులకు వ్యాక్సిన్లు వేయడం ద్వారా వాటి నుంచి మానవులకు వ్యాధులు రాకుండా నిరోధించవచ్చు. ఆదివారం ప్రపంచ జూనోసిస్ డే సందర్భంగా జంతువులు, వాటి నుంచి వచ్చే వ్యాధులు, జాగ్రత్తలను తెలుసుకుందాం.

250 వ్యాధులు

మనుషుల నుంచి పశువులకు... పశువుల నుంచి మనుషులకు సంక్రమించే వ్యాధులనే జూనోటిక్ వ్యాధులు అంటారు. ఇలాంటి వాటిని ఇప్పటి వరకూ 250 వ్యాధులను ప్రపంచ వ్యాప్తంగా గుర్తించారు. ఇందులో 15 వరకూ ప్రాణాంతకమైనవని వైద్య నిపుణులు చెబుతున్నారు. ప్రధానంగా రేబిస్ వ్యాధి, బ్రూసెల్లోసిస్, బర్డ్‌ఫ్లూ, ఇన్‌ఫ్లూయంజా, అంత్రాక్స్ టీబీ, లెప్టో సిపారోసిస్ వంటివి ఉన్నాయి. ఇందులో రేబిస్ వ్యాధి అధిక శాతం కుక్కలకు వచ్చే ప్రాణాంతక వ్యాధి. దీనినే హైడ్రోఫ్రోబియస్ అని పిలుస్తారు.

ప్రమాదకరం.. రేబిస్

రేబిస్... ప్రపంచాన్ని వణికిస్తున్న వ్యాధి. ఇది జంతువులకే కాదు. మనుషులకు వచ్చే భయంకరమైన వ్యాధి. ఈ వ్యాధి ముదిరితే మందు లేదు. 1885 జూలై 6న లూయి పాశ్చర్ అనే శాస్త్రవేత్త రేబిస్ టీకా ప్రయోగం విజయవంతమైంది. ఆ రోజున జూనోసిస్ (భారత్‌లో రేబిస్ డే) డేగా నిర్వహిస్తున్నారు. లిస్సా అనే క్రిమివల్లన రేబిస్ వ్యాప్తి చెందుతుంది. లిస్సా క్రిమి చేరిన కుక్కకాటు వల్ల రేబిస్ వ్యాధి మనుషులకు, ఇతర జంతువులకు సంక్రమిస్తుంది. ఈ వ్యాధికి గురైన వ్యక్తికి జ్వరం, తలనొప్పితో పాటు కోమాలోకి వెళ్లే ప్రమాదముంది. కుక్క లా చొంగ కారడం, కంటి నుంచి నీరు కారడం, నీటిని చూసి భయపడడం, కుక్కలా మొరగడం వంటి లక్షణాలు కనిపిస్తాయి. ఈ వ్యాధితో మనుషులైనా.. జంతువులైనా మరణించే అవకాశాలు ఉన్నాయి.

- **జాగ్రత్తలు:** కుక్క కరిస్తే ఆ గాయాన్ని సబ్బుతో శుభ్రంగా కడగాలి. తక్షణం వైద్యుని సంప్రందించి తగిన వైద్యసేవలు పొందాలి. జంతువులకు కుక్కలు కరిచినా ఇదే పద్ధతిని పాటించాలి. పెంపుడు కుక్కలకు క్రమం తప్పకుండా ఏఆర్‌వీ వ్యాక్సిన్ వేయించాలి.
- **అంత్రాక్స్:** అంత్రాక్స్ క్రిమి ఉన్న పశుమాంసం తినడం, చర్మం తీయడం వల్ల ఈ వ్యాధి సోకుతుంది.మనుషుల్లో ఈ వ్యాధి వల్ల ముఖం, చేతులు, మెడ, కాళ్లపై కార్బాన్ క్యూట్స్ వస్తాయి. జ్వరం, మెడ వాచిపోవడం, గొంతునొప్పి, దగ్గు, ఊపిరి పీల్చలేకపోవడం, నోటి నుంచి రక్తం కారడం తదితర లక్షణాలు కన్పిస్తాయి. అంత్రాక్స్ వ్యాధితో చనిపోయిన పశువుల జోలికి వెళ్లకపోవడం ఉత్తమం. ఈ వ్యాధితో మరణించే పశువులను పది అడుగుల లోతున గోతిలో సున్నం వేసి పాతిపెట్టాలి.



పెంపుడు కుక్కకు చికిత్స చేస్తున్న డాక్టర్ విష్ణు

పచ్చిపాలు, గుడ్డు తీసుకోకూడదు..



పచ్చిపాలు తాగకూడదు. పచ్చి గుడ్డు తినకూడదు. జూనోసిస్ వ్యాధుల్లో కీలకమైనవి రేబిస్, అంత్రాక్స్, టీబీ, మెదడువాపు వ్యాధి. జూనోసిస్ డే సందర్భంగా జూలై 6న ఉచితంగా ఏఆర్‌వీ వ్యాక్సిన్ కుక్కలకు వేస్తాం. జూనోసిస్ వ్యాధులపై అవగాహన కల్పిస్తాం. జంతువుల నుంచి వచ్చే వ్యాధుల గురించి పెంపకందారులు తెలుసుకోవడం ఉత్తమం. అవగాహనతోనే జూనోసిస్ వ్యాధుల నివారణ సాధ్యం.

-బీవీఎస్పీపీ గంగాధర్ రావు, ఏడీ, పశుసంవర్ధక శాఖ

జాగ్రత్తలు తప్పనిసరి..



పశువులు, కోళ్లు, ఇతర పెంపుడు జంతువులకు కాలానుగుణంగా వ్యాధి నిరోధక టీకాలు తప్పనిసరిగా ఇవ్వాలి. ముఖ్యంగా పెంపుడు శునకాలు, పిల్లులకు యాంటీ రేబిస్ టీకాలు తప్పనిసరిగా వేయించాలి. రైతులు 4 నుంచి 8 నెలల వయస్సున్న దూడలకు బ్రూసెలా వ్యాధి నిరోధక టీకా వేయించాలి. పశువుల పాకలను అప్పుడప్పుడు క్రిమి సంహారక మందులతో శుభ్రం చేయాలి. పెంపుడు జంతువులను తాకిన తరువాత యాంటీ సెప్టిక్ లోషన్, సబ్బుతో శుభ్రంగా కడుక్కోవాలి. జిల్లాలో జూనోసిస్ దినోత్సవానికి సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. అన్ని ఆస్పత్రులకు యాంటీ రేబిస్ డోసులను తరలించాం. మూడు నెలల వయసు దాటిన కుక్కలు, పిల్లులకు టీకాలు వేయనున్నాం.

-డాక్టర్ వైవీ రమణ, జాయింట్ డైరెక్టర్, పశుసంవర్ధక శాఖ, విజయనగరం

యజమానులకు అవగాహన కల్పిస్తున్నాం..

జూనోసిస్ వ్యాధులపై పెంపుడు జంతువుల యజమానులకు అవగాహన కల్పిస్తున్నాం. బొబ్బిలి పట్టణ, పరిసర ప్రాంతాలలో సుమారు 250 పెంపుడు జంతువులు ఉన్నాయి. ఆదివారం స్థానిక పశువుల ఆసుపత్రి ప్రాంగణంలో పెంపుడు జంతువులకు ఉచితంగా టీకాలు వేస్తాం

-డాక్టర్ ఎల్.విష్ణు, ఇన్‌చార్జి డిప్యూటీ డైరెక్టర్, బొబ్బిలి

రేబిస్‌తో ప్రమాదం..

జంతువులు, పక్షుల నుంచి సంక్రమించే వ్యాధులు చాలా ప్రమాదమైనవి. ఈ విషయంలో చాలా జాగ్రత్తగా ఉండాలి. ప్రతి పెంపుడు జంతువుకు విధిగా యాంటీ రేబిస్ టీకాలు వేయాలి. విజయనగరంలోని బహుళార్ధ పశువైద్యశాలతో పాటు జిల్లాలోని అన్ని పశువుల ఆస్పత్రుల్లో ఆదివారం టీకాలు వేయనున్నాం.

-జి.మహాలక్ష్మీదేవి, ఉప సంచాలకురాలు, పశువైద్యశాఖ, విజయనగరం

జాగ్రత్తలు పాటించండి..

పెంపుడు కుక్కల యజమానులు జాగ్రత్తలు పాటించాలి. కుక్కలు ఉండే ప్రదేశాన్ని క్రిమి సంహారక ద్రావణంతో శుభ్రపరచాలి. కుక్కలను తాకిన తరువాత చేతులను క్రిమి సంహారక ద్రావణంతో కడగాలి. వ్యాధుల నివారణకు రెగ్యులర్ టీకాలు వేయించాలి. నట్టల నివారణ మందులు క్రమం తప్పకుండా వేయించాలి. అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో కుక్కలకు ఆదివారం ఉచితంగా రేబిస్ వ్యాక్సిన్ వేస్తాం.

-చంద్రశేఖర్, ఏడీ, పశువైద్య శాఖ, గజపతినగరం

ఎన్నికల్లో ఇచ్చిన హామీల అమలు

- జిల్లా వ్యాప్తంగా సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమం



గుర్ల: కెల్లలో కరపత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే కళావెంకటరావు



నెల్లిమర్ల: కొత్తపేటలో కరపత్రాలను పంపిణీ చేస్తున్న నాగార్జున



శృంగవరపుకోట రూరల్: ఆర్.వేములాపల్లిలో బాలలతో ముచ్చటిస్తున్న టీడీపీ నాయకులు

ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ప్రభుత్వం అమలుచేస్తోందని టీడీపీ నాయకులు తెలిపారు. శనివారం జిల్లాలోనిపలుచోట్ల తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా కరపత్రాలు అందజేసి ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ, చేసిన అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. అనంతరం టీడీపీ నాయకులు మాట్లాడుతూ సూపర్‌సిక్స్ కార్యక్రమాల్లో భాగంగా సామాజిక పింఛన్లు పెంపుదల, తల్లికి వందనం కార్యక్రమాలను అమలుచేసినట్లు తెలిపారు. ఉచిత గ్యాస్ పంపిణీ చేపట్టామన్నారు.మహిళలకు ఉచిత బస్సు ఆగస్టు 15న ప్రారంభమవుతుందన్నారు. -(ఆంధ్రజ్యోతి బృందం)



విజయనగరం రూరల్: నగరపాలక సంస్థ పరిధిలో..



భోగాపురం: కరపత్రాలు పంపిణీ చేస్తున్న కర్రోతు బంగార్రాజు

రాజాంలో యువకుడి ఆత్మహత్య



శ్రీనివాస రావు(ఫైల్)

రాజాం రూరల్, జూలై 5(ఆంధ్రజ్యోతి): రాజాంలో ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసుల కథనం మేరకు.. వంగర మండలంలోని కొప్పరకు చెందిన బూరి శ్రీనివాసరావు (29) 15రోజుల కిందట రాజాంలోని బజాజ్ ఫైనాన్స్‌లో సేల్స్ ఎగ్జిక్యూటివ్‌గా చేరాడు. పట్టణంలోని తెల గవీధిలో మరో మిత్రుడితో కలిసి ఓ రూంలో ఉంటున్నాడు. శనివారం ఉదయం శ్రీనివాసరావుకు తండ్రి నారాయణరావు ఫోన్‌చేశాడు. సెల్ స్విచ్ఛాఫ్‌రావడంతో శ్రీనివాసరావుతోపాటు రూములో ఉంటున్న రాజ్ కుమార్‌కు నారాయణరావు ఫోన్‌చేసి విషయాన్ని తెలియజేశాడు. దీంతో రాజ్‌కుమార్ రూముకు చేరుకునే సమయానికి గది లోపల గడియ పెట్టి ఉండడంతో కిటికీ లోపలి నుంచి పరిశీలించాడు. అప్పటికే శ్రీనివాసరావు ఫ్యాన్‌కు వేలాడుతూఉన్నట్లు గమనించాడు.రాజ్‌కుమార్ విషయాన్ని శ్రీని వాసరావు తండ్రి నారాయణరావుతోపాటు రాజాం పోలీసులకు సమాచా రం అందించాడు. ఘటనా స్థలానికి చేరుకున్న ఎస్ఐ రవికిరణ్ పరిస రాలను గమనించి, శ్రీనివాసరావు జేబులో లభించిన లెటర్‌ను స్వాధీనం చేసుకున్నారు.శ్రీనివాసరావు మూడునెలలుగా కడుపునొప్పితో బాధపడు తున్నాడని, గ్రామంలో నాటువైద్యం చేయించుకుంటున్నాడని, నొప్పి తీవ్రం కావడంతో ఆత్మహత్యకు పాల్పడి ఉండవచ్చని నారాయణరావు రాజాం పోలీసులకు ఫిర్యాదుచేశారు. ఎస్ఐ రవికిరణ్ కేసు నమోదు చేశారు.

సంతకవిటిలోని వైన్ షాపులో చోరీ

సంతకవిటి, జూలై 5(ఆంధ్రజ్యోతి):సంతకవిటిలోని జిపి వైన్‌షాపులో చోరీ జరిగింది. నిందితులు ఆధారాలు దొరక్కుండా ఉండేందుకు సీసీ కెమెరాల హార్డ్‌డిస్కులు ఎత్తుకువెళ్లారు. పోలీసుల కథనం మేరకు.. శుక్రవారం అర్ధరాత్రి వైన్ షాపు వెనుక వైపు నుంచి గోడకు రంధ్రం చేసి, షాపులోకి ప్రవేశించి రూ. 24,260 వేల విలువచేసే మద్యం బాటిళ్లు, రూ. 14 వేలు నగదు చోరీచేశారు. దొంగతనం బయటపడకుండా ఉండేందుకు సీసీ కెమెరాలకు సంబంధించి హార్డ్‌డిస్క్‌ను ఎత్తికెళ్లారు. నిర్వాహకులు రాత్రి షాపు మూసే సమయంలో లెక్కలు చూసి తాళం వేసి వెళ్లిపోయారు. శనివారం ఉదయం యథావిధిగా షాపు తెరిచి చూసే సరికి, కౌంటర్ తెరిచిఉంది. కౌంటర్‌లోని డబ్బులు లేకపోవడంతో, షాపు మొత్తాన్ని పరిశీలించారు. వైన్ షాపు వెనుక వైపు నుంచి గోడకి రంధ్రం చేసి షాపులోకి ప్రవేశించారు. వైన్ షాపులో నౌకరి నామాగా పనిచేస్తున్న పేడాడ గోవిందరావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ ఎమ్. వాసుదేవరావు తెలిపారు.

రథయాత్రకు వెళ్తుండగా ఆటో బోల్తా

కురుపాం/ గుమ్మలక్ష్మీపురం, జూలై 5(ఆంధ్రజ్యోతి): జగన్నాథస్వామి రథయాత్రకు వెళ్తున్న ఆటో బోల్తాపడిన ఘటనలో ఐదుగురికి తీవ్ర గాయాలు కాగా, పలువురికి స్వల్ప గాయాలయ్యాయి. ఈ ఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గుమ్మలక్ష్మీపురం మండలం కొండుకుప్ప గ్రామం నుంచి పలువురు భక్తులు ఒడిశా రాష్ట్రం రాయగడలో జరగుతున్న రథయత్రకు శనివారం సాయంత్రం ఆటోలో బయలుదేరారు. ఒడిశా పిప్పలగూడ ఘటి వద్దకు వచ్చేసరికి ఆటో బోల్తా పడింది. దీంతో ఆటో ఉన్నవారికి గాయాలయ్యాయి. వీరిలో కొండుకుప్ప గ్రామానికి చెందిన పత్తిక సుమతి, స్నేహ, జయంతి, మూలుగూడ గ్రామానికి చెందిన పత్తిక శ్రీరామ్, జీలకర్ర శ్రావంతిలకు తీవ్ర గాయాలయ్యాయి. వీరిని 108 వాహనం ద్వారా కురుపాం సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం పార్వతీపురం జిల్లా ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై స్థానిక పోలీసులు కేసు నమోదుచేసి, దర్యాప్తు చేస్తున్నారు.

కాపుసోంపురంలో వ్యాన్ బోల్తా

శృంగవరపుకోట రూరల్, జూలై 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని కాపుసోంపురం వద్ద అరకు-విశాఖ ప్రధాన రహదారిపై మేకల లోడుతో వెళ్తున్న వ్యాన్ అదుపుతప్పి బోల్తాపడింది. శనివారం ఉదయం ఎస్.కోట నుంచి అరకు మేకలలోడుతో వెళ్తున్న వ్యాన్ బోల్తాపడడంతో మేకలకు గాయాలు కాగా డ్రైవర్, అందులోఉన్నవారికి కూడా స్వల్పగాయాలయ్యాయి. దీంతో అరగంటపాటు ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది.

నెట్‌వర్క్ ఆసుపత్రుల్లో విచారణ

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

విజయనగరం రింగురోడ్డు, జూలై 5 (ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ వైద్య సేవలపై రెండు రోజులుగా ఆంధ్రజ్యోతిలో ప్రచురితమవుతున్న కథనాల నేపథ్యంలో పూర్తిస్థాయిలో విచారణ జరిపిస్తామని ఎన్టీఆర్ వైద్యసేవ కో-ఆర్డినేటర్ డాక్టరు సాయిరాం ఒక ప్రకటనలో తెలిపారు. అన్ని నెట్‌వర్క్ ఆసుపత్రుల్లో విచారణ చేశామని చెప్పారు. ఆసుపత్రుల యాజమాన్యాలు మందులు తీసుకోవాలని ఏ విధమైన ఒత్తిడి చేయలేదని పేర్కొన్నాయని తెలిపారు. ఆంధ్రజ్యోతిలో అందరి జాతకాలు బయటపెడతామన్న కథనం ప్రకారం నాలుగు రోజులుగా ఏ సమావేశం నిర్వహించలేదని, జూమ్ మీటింగు జరగలేదని పేర్కొన్నారు.

రేపు మిగులు సీట్లకు కౌన్సెలింగ్

నెల్లిమర్ల, జూలై 5(ఆంధ్రజ్యోతి): విజయనగరం, మన్యం జిల్లాలో గల ఐదు బాలురు, ఎనిమిది బాలికల పాఠశాలల్లో ఐదో తరగతి, ఇంటర్‌లో మిగులు సీట్ల భర్తీకి సోమవారం నెల్లిమర్ల గురుకుల పాఠశాలలో కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్టు ఉమ్మడి జిల్లాల సమన్వయకర్త తెలిపారు. సీట్లు కావాల్సిన ఎస్సీ, ఎస్టీ బాలికలు సోమవారం ఉదయం తొమ్మిది గంటలకు, బాలురు మధ్యాహ్నం ఒంటి గంటకు హాజరు కావాలని కోరారు. కౌన్సెలింగ్‌కు ఆధార్ జెరాక్స్, కుల ధ్రువీకరణ పత్రం, పదో తరగతి మార్కుల జాబితా తీసుకొని రావాలని కోరారు.

సెల్‌ఫోన్ రిపేరింగ్‌పై శిక్షణ

విజయనగరం దాసన్నపేట, జూలై 5 (ఆంధ్రజ్యోతి): విజయనగరంలో జన శిక్షణా సంస్థాన్ ఆధ్వర్యంలో 2025-26 సంవత్సరానికి మినిస్ట్రీ ఆఫ్ స్కిల్ డెవలప్‌మెంట్ ఇండియా ద్వారా సెల్‌ఫోన్ రిపేరింగుపై ఉచితంగా శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు ఆ సంస్థ డైరక్టర్ వి.హరీష్ ఒక ప్రకటనలో తెలిపారు. శిక్షణకు నిరుద్యోగ యువత నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని పేర్కొన్నారు.ఎంఆర్ అటానమస్ కళాశాల సమీపంలోని ఏఎంఆర్ స్మార్ట్‌ఫోన్ సర్వీస్ సెంటర్‌లో రోజుకి మూడు గంటలు మాత్రమే శిక్షణ ఇసామని, ఎటువంటి ఫీజులు చెల్లించాల్సినవసరం లేదని తెలిపారు.ఆసక్తిగల అభ్యర్థులు కంటోన్మెంట్ ఉడాకాలనీలోని జన శిక్షణ సంస్థాన్ కార్యాలయంలో శిక్షణ నిమిత్తం సంప్రదించాలని తెలిపారు. వివరాలకు 86397 85348, 95736 24866 ఫోన్ నెంబర్లకు సంప్రదించాలని కోరారు.

మాటలతో ప్రజలను మభ్యపెట్టవద్దు: ఎమ్మెల్సీ

శృంగవరపుకోట రూరల్, జూలై 5 (ఆంధ్రజ్యోతి): మాటలతో ప్రజలను మభ్యపెట్టవద్దని స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు కోరారు.ఎంఎస్‌ఎంఈ మంత్రి కొండపల్లి శ్రీనివాస్, ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి మాటలు ఈ ప్రాంత ప్రజలను మభ్యపెట్టేలా ఉన్నాయని తెలిపారు.శనివారం బొడ్డవరలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎంఎస్‌ఎంఈ పార్కులు ఈప్రాంతంలో వస్తాయని, అందకే స్వాగతించాలని ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి, డీసీఎంఎస్ ఛైర్మన్ గొంప కృష్ణ తదితరులు చెబుతున్నారన్నారు. రెండురోజుల కిందట జరిగిన జడ్పీ సమావేశంలో తాను ప్రశ్నించిన అంశంపై మంత్రి కొండపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రభుత్వం దృష్టిలో ఇక్కడ పరిశ్రమల ఏర్పాటు అంశం లేదని చెప్పడం విస్మయం కలిగించిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న విజన్-2047 నివేదికలో కొత్తవలసలో పతంజలి పార్కు,ఇతర పరిశ్రమల ఏర్పాటు వంటివి ఉన్నాయని, ఇందులో ఎస్.కోట మండలంలోని జిందాల్ భూముల్లో ఎంఎస్‌ఎంఈ పార్కుల ఏర్పాటు గురించి ఎక్కడ లేదన్న విషయాన్ని వివరించారన్నారు.తనను కొందరు ప్రభుత్వ వ్యతిరేకిగా ముద్రవేస్తున్నారని, జిందాల్ పరిశ్రమ ఏర్పాటు కోసం తాను ఈప్రాంత వాసులను ఒప్పించి వందలఎకరాలు భూములు ఇప్పించానని పరిశ్రమ రాకపోయే సరికి తన ఇంటికి వచ్చి ప్రశ్నిస్తున్నారన్నారు.

పీ-4తో పేదలకు ప్రయోజనం

చీపురుపల్లి, జూలై 5 (ఆంధ్రజ్యోతి):ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆలోచనలకు అనుగుణంగా పీ-4 విధానం ద్వారా పేదలకు ప్రయోజనం చేకూర్చవచ్చని ఎమ్మెల్యే కిమిడి కళావెంకటరావు తెలిపారు. శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పీ-4 విజన్-2047 అంశంపై నాలుగు మండలాల అధికారులతో సమీక్షించారు.కార్యక్రమంలో చీపురుపల్లి ఎంపీడీవో ఇప్పలవలస సురేష్, తహసీల్దారు ధర్మరాజు పాల్గొన్నారు.

ప్రజాప్రతినిధుల వినతులు పరిష్కరించండి

భోగాపురం, జూలై5(ఆంధ్రజ్యోతి):గ్రామ, మండల స్థాయి ప్రజాప్రతినిధులిచ్చిన వినతులు అధికారులు పరిష్కరించాలని నెల్లిమర్ల ఎమ్మెల్యే లోకం నాగమాధవి కోరారు.శనివారంభోగాపురం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ ఉప్పాడ అనూషా అధ్యక్షతన మండలసమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ముక్కాం ఎంపీటీసీ బాబాజీ, కవులవాడ, రామచంద్రపేట సర్పంచ్‌లు కొండపు ఎల్లయ్యమ్మ, దుక్కగౌరిలు గత కొన్ని సమావేశాలు నుంచి సమస్యలు చెబుతున్నా పరిష్కారం కావడంలేదని వాపోయారు.ఎంపీపీ ఉప్పాడ అనూషా మాట్లాడుతూ సమస్యలు పరిష్కరించని అధికారులు ఎందుకని ప్రశ్నించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీలు డి.సూర్యనారాయణ రాజు, పచ్చిపాలనాగలక్ష్మి, తహసీల్దార్ ఎం.రమణమ్మ, ఎంపీడీవో కిషోర్‌కుమార్, జిల్లా మత్స్యకార సంఘ అధ్యక్షులు బి.చిన్నప్పన్న పాల్గొన్నారు. కాగా ముంజేరు సమీప జనసేన కార్యాలయంలో ఎమ్మెల్యే లోకం నాగమాదవి ఉపాధి పథకంపై నియోజకవర్గంలోని అధికారులతో సమీక్షించారు. కార్యక్రమంలో ఏపీడీ పద్మజ, ఏపీవోలు, టెక్నికల్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

ఎయిర్ పోర్టుకు విద్యుత్ లైన్ల ఏర్పాటుకు పరిశీలన

భోగాపురం, జూలై5(ఆంధ్రజ్యోతి): మండలంలో నిర్మిస్తున్న అంతర్జాతీయ గ్రీన్ ఫీల్డ్ విమానాశ్రయానికి విద్యుత్ లైన్ల ఏర్పాటుకు సంబంధించి ఏపీఈపీడీసీఎల్ ఆపరేషన్ డైరెక్టర్ సూర్యప్రకాశ్ శనివారం రావివలస, గూడెపువలస, కంచేరు ప్రాంతాల్లో పరిశీలించారు. ఈ సందర్భంగా ఎయిర్‌పోర్టుకు విద్యుత్ లైన్లు ఏవిదంగా వేయాలి, ఏటువైపు ఏర్పాటు చేయాలో సంబంధించి మ్యాప్ ద్వారా పరిశీలించారు. ఆయనతో పాటు విజయనగరం సూపరింటెండెంట్ ఇంజినీర్ ఎం.లక్ష్మణరావు, రూరల్ ఎగ్జిక్యుటివ్ ఇంజినీర్ జి.సురేష్‌బాబు, సత్యనారాయణ, డిప్యూటీ ఇంజినీర్ మాదవనాయుడు, ఏఈ షేక్‌మస్తాన్ తదితరులు ఉన్నారు.

సాంకేతికతను వినియోగించుకోవాలి: ఎస్పీ

విజయనగరం క్రైం, జూలై 5(ఆంధ్రజ్యోతి):సాంకేతికతను వినియోగించుకుని ప్రతి అంశంపై పరిజ్ఞానాన్ని మెరుగుపరుచుకోవాలని ఎస్పీ వకుల్ జిందాల్ కోరారు. శనివారం జిల్లా పోలీసు కార్యాలయంలో స్పెషల్ బ్రాంచ్ అధికారులు, సిబ్బందితో సమావేశం నిర్వహించారు. సమావేశంలో సీఐలు లీలారావు, ఆర్‌వీఆర్‌కె చౌదరి, ఎస్ఐ సత్యనారాయణ పాల్గొన్నారు.కాగాజిల్లా పోలీసుశాఖలో ఏఆర్ విభాగంలో కానిస్టేబుల్‌గా పనిచేసి ఇటీవల అనారోగ్యంతో మృతిచెందిన ఎం.సత్తిబాబు సతీమణి రాజేశ్వరీకి లక్షా 47వేల 300 రూపాయల చెక్కును ఎస్పీ వకుల్ జిందాల్ అందజేశారు. కార్యక్రమంలో ఏఎస్పీ సౌమ్యలత, కార్యాలయ సూపరిటెండెంట్ రామకృష్ణ పాల్గొన్నారు.

నువ్వు రైతులను ఆదుకోవాలి

నెల్లిమర్ల, జూలై 5(ఆంధ్రజ్యోతి): నువ్వు పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలని రైతు సంఘం నాయకులు కిల్లంపల్లి రామారావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం జరజాపుపేటలో వర్షాలతో తడిసిపోయిన నువ్వు పంటను రైతులతో కలిసి పరిశీలించారు. కార్యక్రమంలో రైతులు అవనాపు నాగేశ్వరరావు, కిల్లంపల్లి శ్రీను, సుద్దాపు గోవింద, మద్దిల ముత్యాలు, మద్దిల కృష్ణ పాల్గొన్నారు.

భజనలు చేస్తూ.. సంకీర్తనలు పాడుతూ

- సింహాచలం వరకూ రెండు వేల మంది పాదయాత్ర



పాదయాత్రగా సింహాచలం వెళ్తున్న భక్తులు

కొత్తవలస, జూలై 5 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మంగళపాలెంలో గల గురుదేవ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో శనివారం ట్రస్టు కార్యాలయం నుంచి సింహాచలం వరకు పాదయాత్రను నిర్వహించారు. పూరిలో జరుగుతున్న స్వామి వారి జగన్నాథ రథయాత్రను పురస్కరించుకుని ఈ యాత్రను ప్రతిఏటా నిర్వహిస్తుంటారు. ట్రస్టు ఛైర్మన్ రాపర్తి జగదీష్‌బాబు ఆధ్వర్యంలో ఒడిశా, అరకు, విజయనగరం, విశాఖ జిల్లాలకు చెందిన 60 గ్రామాల నుంచి సుమారు రెండు వేల మంది భజనలు చేస్తూ.. సంకీర్తనలు పాడుతూ పాదయాత్రగా సింహాచలంలోని వరహాలక్ష్మి నృసింహస్వామివారిని దర్శించుకున్నారు.గిరిపుత్రులతోపాటు తరిగొండ వెంగమాంబ భజనబృందం సభ్యులు భజనలు చేసుకొని పాదయాత్ర చేశారు.

భూముల కబ్జాపై లోకాయుక్తకు ఫిర్యాదు

జామి,జూలై 5 (ఆంధ్రజ్యోతి): జామిలో ప్రభుత్వభూములు కబ్జాపై లోకాయుక్తకు ఫిర్యాదుచేసినట్లు తాండ్రంగికి చెందిన హ్యూమన్ రైట్స్ ప్రతినిధి కొత్తలి గౌరినాయుడు తెలిపారు. డీపట్టా భూముల్లో ప్రైవేటు స్కూళ్ల నిర్మాణంపై ఆధారాలతో అందించామని, దర్యాప్తుచేయిస్తామని అధికారులు తెలిపారన్నారు.

డీజీపీ, ఎస్పీకి దరఖాస్తు

శృంగవరపుకోట రూరల్,జూలై 5 (ఆంధ్రజ్యోతి): నిరసనకు పోలీసులు అనుమతి ఇవ్వాలని కోరినా పట్టించుకోకపోవడంతో డీజీపీ, ఎస్పీకి వాట్సప్ ఈ గవర్నెన్స్‌లో, రిజిస్టర్ పోస్టులో దరఖాస్తు చేసినట్లు జిందాల్ నిర్వాసిత మహిళలు తెలిపారు. శనివారం ఎస్.కోట పోలీస్‌స్టేషన్ వద్ద మట్లాడుతూ 18 ఏళ్ల కిందట భూములిచ్చామని ఇప్పటికి న్యాయం జరగలేదని, దీంతో తాము శాంతియుతమైన పోరాటం చేస్తున్నామని తెలిపారు.

లోక్‌అదాలత్‌తో సత్వర న్యాయం

రాజాం రూరల్, జూలై 5 (ఆంధ్రజ్యోతి): లోక్‌అదాలత్ ద్వారా సత్వరన్యాయం లభిస్తుందని మండల న్యాయసేవాధికార సంస్థ అధ్యక్షురాలు, సీనియర్ న్యాయాధికారి కె.శారదాంభ తెలిపారు.రాజాంలో జూనియర్ న్యాయాధికారి నైమిషతో కలిసి న్యాయ విజ్ఞానసదస్సు నిర్వహించారు. అనంతరం కోర్టు ప్రాంగణంలో నిర్వహించిన జాతీయ లోక్‌అదాలత్‌లో 136 కేసులు పరిష్కరించినట్లు కె.శారదాంభ ఒక ప్రకటనలో తెలియజేశారు.

- గజపతినగరం, జూలై5 (ఆంధ్రజ్యోతి): క్షణికావేశంలో చేసిన తప్పులను రాజీ ద్వారా పరిష్కరించుకోవాలని న్యాయాధికారి ఎ. విజయ్‌రాజ్‌కుమార్ కోరారు. స్థానిక కోర్టులో నిర్వహించిన లోక్ అదాలత్‌లో 348 కేసులు పరిష్కరించారు.
- శృంగవరపుకోట, జూలై 5 (ఆంధ్రజ్యోతి): ఎస్.కోట కోర్టులో న్యాయాధికారి బి.కనకలక్ష్మి అధ్యక్షతన జరిగిన లోక్‌అదాలత్‌లో 47 కేసులు పరిష్కారమయ్యాయి. కార్యక్రమంలో సెకెండ్ క్లాస్ మేజిస్ట్రేట్ జి.అప్పలనాయుడు, న్యాయవాదులు బి.సత్యనారాయణ. ఎం.అప్పారావు, జి.సూరిదేముడు, రామారావు పాల్గొన్నారు.

సమస్య ఉందా.. స్కాన్ చేసి ఫిర్యాదు చెయ్!

(ఐదో పేజీ తరువాయి)

సరైన తూకంలో సరుకులు ఇచ్చారా..?.. అధిక ధరలు వసూలు చేశారా..? డీలర్ మీతో మర్యాదపూర్వకంగా వ్యవహరించారా, సరుకుల పంపిణీ సమయపాలన పాటిస్తున్నారా..? అనే ప్రశ్నలతో వెబ్ పేజీ ఓపెన్ అవుతుంది. అందులోని ప్రశ్నలకు అవునా, లేదా అనే సమాధానం ఇస్తే చాలు. కార్డుదారుల ఫిర్యాదులు, అభిప్రాయాలు నేరుగా సంబంధిత ఉన్నతాధికారులకు చేరుతాయి. తద్వారా వారు ఆ ఫిర్యాదులను పరిష్కరించనున్నారు.

లోక్ అదాలత్‌లో 116 కేసుల రాజీ



మాట్లాడుతున్న రెండో అదనపు జిల్లా న్యాయాధికారి దామోదరరావు

బెలగాం, జూలై 5(ఆంధ్రజ్యోతి): జాతీయ లోక్ అదాలత్‌లో 116 కేసులు రాజీ అయినట్లు రెండో అదనపు జిల్లా న్యాయాధికారి ఎస్.దామోదరరావు తెలిపారు. శనివారం జిల్లా కోర్టు ప్రాంగణంలో జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. ఈ సందర్భంగా చెక్ బౌన్స్‌లు-03, ఐపీసీ-60, మేంటెనెన్సు-1, విడాకులు-1, మోటారు యాక్సిడెంట్ -3, సివిల్ దావాలు-4, ఎక్సైజ్ -28, ప్రిలిటిగేషన్-1, ఇతర కేసులు 16 వరకు రాజీ అయ్యాయి. పెండింగ్‌లో ఉన్న కేసులను సామరస్యంగా పరిష్కరించుకోవడానికి లోక్ అదాలత్ మంచి వేదికని ఆయన తెలిపారు. సివిల్, క్రిమినల్, మోటార్ ప్రమాద పరిహార కేసులు, పలు వివాదాలను పరిష్కరించడం శుభపరిణా మమన్నారు. కార్యక్రమంలో అడిషనల్ జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ జె.సౌమ్య జాస్మిన్, అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ కె.చంద్రకుమార్, బార్ ప్రెసిడెంట్ ఎస్.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

● పాలకొండ: పట్టణంలోని కోర్టు ఆవరణలో శనివారం జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. మండల న్యాయ సేవాధికార సంస్థ అధ్యక్షురాలు హరిప్రియ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. పెండింగ్‌లో ఉన్న 62 కేసులను రాజీ మార్గం ద్వారా, 342 కేసులను ఫైన్ కట్టడంతో పరిష్కరించారు. ● సాలూరు: సాలూరు జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో శనివారం జాతీయ లోక్‌అదాలత్ సందర్భంగా సుమారు 208 సివిల్, క్రిమినల్, మనోవర్తి, గృహహింస, ఇతర కేసులు పరిష్కరించారు. ఈ కార్యక్రమానికి న్యాయాధికారి జి.హర్షవర్ధన్, న్యాయవాదుల సంఘం సభ్యులు హాజరయ్యారు.

సూపర్ సిక్స్ పథకాలు అమలు చేయాలి



మాట్లాడుతున్న వైసీపీ నేత కన్నబాబు

పార్వతీపురం టౌన్, జూలై 5 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల ముందు కూటమి ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయాలని వైసీపీ ఉత్తరాంధ్ర జిల్లాల రీజనల్ కోఆర్డినేటర్ కె.కన్నబాబు డిమాండ్ చేశారు. రీ కాల్ చంద్రబాబు మేనిఫెస్టో కార్యక్రమంలో భాగం గా శనివారం పార్వతీపురం పట్టణంలో వైసీపీ జిల్లా అధ్యక్షుడు ఎస్.పరిక్షిత్ రాజు ఆధ్వర్యంలో జిల్లా స్థాయి విస్తృత సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని, మాట్లాడారు. కూటమి ప్రభుత్వం రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా మోసం చేస్తుందన్నారు. వైసీపీ శాసన మండలి ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ మాట్లాడుతూ ఎన్నికల ముందు చంద్రబాబు నాయుడు, పవన్‌కల్యాణ్‌లు రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన హామీలను తూచా తప్పకుండా అమలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో అరకు ఎంపీ తనుజారాణి, మాజీ ఉపముఖ్యమంత్రులు రాజన్నదొర, పుష్పశ్రీవాణి, పార్వతీపురం, పాలకొండ మాజీ ఎమ్మెల్యేలు జోగరావు, కళావతి తదితరులు పాల్గొన్నారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత

పాలకొండ, జూలై 5 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా తరలిస్తున్న పీడీఎస్ బియ్యాన్ని విజిలెన్స్ అధికారులు శనివారం పట్టుకున్నారు. వీరఘట్టం నుంచి పాలకొండ మీదుగా ఒడిశాకు తరలిస్తున్న పీడీఎస్ బియ్యాన్ని ఓ అజ్ఞాత వ్యక్తి ఇచ్చిన సమాచారం మేరకు వీరఘట్టం నుంచి పాలకొండ మీదుగా ఒడిశా తరలిస్తుండగా పాలకొండ చెక్‌పోస్టు దగ్గర చాకచక్యంతో విజిలెన్స్ అధికారులు పట్టుకున్నారు. బియ్యం సుమారుగా 2 వేల 200 కేజీలు ఉంటాయని, దీని విలువ రూ.లక్ష ఉంటుందని చెప్పారు. 6ఏ ఏసు నమోదు చేసి రెవెన్యూ వారికి అప్పగించామన్నారు. ఈ తనిఖీల్లో విజిలెన్స్ శ్రీకాకుళం ప్రాంతీయ కార్యాలయం ఎస్ఐ రామారావు, సిబ్బంది లక్ష్మీనారాయణ, కన్నబాబు, శ్రీను, పాలకొండ, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యా కార్యక్రమాల్లో వెల్ఫేర్ అసిస్టెంట్లు భాగస్వాములు కావాలి

గరుగుబిల్లి, జూలై 5 (ఆంధ్రజ్యోతి): మండల విద్యాశాఖ కార్యక్రమాల్లో వెల్ఫేర్ అండ్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్లు భాగస్వామ్యం కావాలని ఎంఈవో-1 సామల సింహాచలం అన్నారు. శనివారం స్థానిక ఎంఈవో కార్యాలయంలో ఆయన వెల్ఫేర్ అండ్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్లతో సమావేశమయ్యారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ఉన్న బడి ఈడు పిల్లలను శత శాతం నమోదు చేసేందుకు, అలాగే ప్రభుత్వపరంగా అందజేస్తున్న తల్లికి వందనం పథకానికి అర్హులందరినీ గుర్తించి ఆ సమాచారాన్ని మండల విద్యాశాఖకు అందించాలని సూచించారు. ఈనెల 10న జరగనున్న మెగా పేరెంట్స్ టీచర్స్ మీటింగ్‌ను విజయవంతం చేసేందుకు ఉపాధ్యాయులకు సహకరించాలని కోరారు. స్వర్ణాంధ్ర 2047 విజన్‌లో భాగంగా పీ-4 కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో-2 కె.కొండలరావు, మండలంలోని ఎడ్యుకేషన్ అసిస్టెంట్లు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

జీడితోటల్లో ఏనుగులు



జీడితోటల్లో సంచరిస్తున్న గజరాజులు

సీతంపేట రూరల్, జూలై 5(ఆంధ్రజ్యోతి): గడచిన కొన్ని రోజులుగా ఏజెన్సీలోని గోరపాడు గ్రామ సమీపంలో సంచరిస్తున్న గజరాజులు శనివారం కొండ దిగువ ప్రాంతంలో ఉన్న జీడితోటల్లో తిష్టవేసాయి. తోటలోని జీడిచెట్లను విరిచి నాశనం చేసినట్లు గోరపాడు గ్రామ గిరిజనులు తెలిపారు. పనస, పైనాపిల్, అరటి పంటలను ధ్వంసం చేస్తున్నట్లు గిరిజన రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం స్పందించి ఏనుగుల గుంపును ఈ ప్రాంతం నుంచి తరలించాలని వారు కోరుతున్నారు.

వికసిత భారత్‌పై సమావేశం

కురుపాం, జూలై 5(ఆంధ్రజ్యోతి): వికసిత భారత్-స్వర్ణాంధ్ర 2047 కార్యక్రమంలో భాగంగా శనివారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో నియోజకవర్గ ప్రత్యేక అధికారి, భద్రగిరి ఎస్‌డీసీ ధర్మారెడ్డి అధ్యక్షతన నియోజకవర్గ అభివృద్ధి కార్యాచరణ ప్రణాళిక సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా అయన ప్రజలకు అవసరాలను తీర్చేందుకు ఎలాంటి సర్వే అవసరమని ఎంపీడీవోలకు అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా ఎస్ సొసైటీ కార్యదర్శి షేక్ గౌస్ గిరిజన ప్రాంతాల్లో పలు సమస్యలను సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. ఈసందర్భంగా ధర్మారెడ్డి మాట్లాడుతూ వికసిత భారత్-స్వర్ణాంధ్ర 2047 నియోజకవర్గ అభివృద్ధి కమిటీకి ఎమ్మెల్యే చైర్మన్‌గా వ్యవహరిస్తారన్నారు. నియోజకవర్గ ప్రత్యేక అధికారి, మండల ప్రత్యేక అధికారులు మెంబర్లుగా ఉంటారని తెలిపారు. ఐసీడీఎస్ జిల్లా పీడీ దుర్గా చక్రవర్తి, ట్రైబల్ వెల్ఫేర్ ఈఈ ఎ.మణిరాజు, నియోజకవర్గంలో గల ఎంపీడీవోలు, తహసీల్దార్‌లు, అధికారులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

జై జగన్నాథ

- ఘనంగా మారు రథ యాత్ర
- గుడించా మందిరాల్లో ప్రత్యేక పూజలు
- అధిక సంఖ్యలో పాల్గొన్న భక్తులు



పార్వతీపురంటౌన్: రథాన్ని లాగుతున్న ఎమ్మెల్యే విజయచంద్ర

జగన్నాథస్వామి మారు రథయాత్ర ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా శనివారం ఘనంగా నిర్వహించారు. గుడించా మందిరంలోగల స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం వైభవంగా రథయాత్ర నిర్వహించారు. ఈ రథయాత్రలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని, స్వామివారిని దర్శించుకున్నారు. (ఆంధ్రజ్యోతి బృందం)



పాలకొండ: జగన్నాథస్వామికి పూజలు నిర్వహిస్తున్న దృశ్యం



కురుపాం రూరల్: మొండెంఖల్‌లో పూజలు



సాలూరు పట్టణంలో..



మక్కువ: జగన్నాథుడిని ఊరేగిస్తున్న దృశ్యం



భామిని: బత్తిలిలో రథయాత్ర



జియ్యమ్మవలస: చినమేరంగిలో..



గజపతినగరంలో..



వీరఘట్టంలో..

చంద్రబాబుతోనే సుపరిపాలన

● మంత్రి శ్రీనివాస్



కరపత్రాలు పంపిణీ చేస్తున్న మంత్రి శ్రీనివాస్

పాలకొండ, జూలై 5 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యపడుతుందని రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్యతరహా శాఖా మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. తుమరాడ గ్రామంలో శనివారం నిర్వహించిన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో ఆయన పాల్గొని, మాట్లాడారు. ఏడాది కాలంలోనే రాష్ట్రానికి రూ.8లక్షల కోట్లు పెట్టుబడులు వచ్చాయని, ఇది ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఐటీ శాఖా మంత్రి నారా లోకేశ్ ఘనత అన్నారు. దీంతో లక్షలాది మంది యువతకు ఉద్యోగ అవకాశాలు ఉంటాయన్నారు. ఇప్పటికే సూపర్‌సిక్స్ పథకాల్లో నాలుగింటిని పూర్తి చేశామని, ఆగస్టు 15న మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రైతులకు అన్నదాత సుఖీభవ కింద నిధులను జమ చేస్తున్నామని తెలిపారు. ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించారు. ప్రజా సమస్యలపై ఆరా తీశారు. స్థానిక రామాలయం వద్ద కూర్చొని స్థానికులతో ముచ్చటించారు. ఈ సందర్భంగా గ్రామంలోని తాగునీటి సమస్య ఉందని మహిళలు మంత్రి దృష్టికి తీసుకురాగా స్థానిక ఎమ్మెల్యేతో చర్చించి సమస్యను పరిష్కరిస్తామన్నారు. వివిధ సమస్యలను పలువురు ఆయన దృష్టికి తీసుకువచ్చారు. అంతకుముందు మంత్రి కోటదుర్గమ్మ ఆలయాన్ని సందర్శించారు. ఈ కార్యక్రమంలో శ్రీకాకుళం డీసీసీబీ చైర్మన్ సూర్యనారా యణ, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కర్నేన అప్పలనాయుడు, పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి పడాల భూదేవి, జాడ శ్రీధర్, వారాడ సుమంత్‌నాయుడు, కర్నేన యోగిత, గండి రామినాయుడు తదితరులు పాల్గొన్నారు.

బంగారు కుటుంబాలను తీర్చిదిద్దాలి

పార్వతీపురం, జూలై 5 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో గుర్తించిన బంగారు కుటుంబాలను తీర్చిదిద్దాలని పార్వతీపురం ఐటీడీఏ పీవో అశుతోష్ శ్రీవాత్సవ సూచించారు. పార్వతీపురం నియోజకవర్గ స్థాయి విజన్ యాక్షన్ ప్లాన్, బంగారు కుటుంబం, మార్గదర్శి కార్యక్రమంపై శనివారం స్థానిక గిరిమిత్ర సమావేశ మందిరంలో సమావేశం నిర్వహించారు. బంగారు కుటుంబాలను ఆన్‌లైన్ ద్వారా ఎంపిక చేసి, వారి అవసరాలను తెలుసుకోవడానికి సర్వే నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర మాట్లాడుతూ ప్రతి కుటుంబం సమాజంలో గౌరవంగా బతకాలన్నారు. ఈ సమావేశంలో డీఆర్డీఏ పీడీ ఎం.సుధారాణి తదితరులు పాల్గొన్నారు.

తొలి అడుగుపై ఎమ్మెల్యే సమీక్ష

పార్వతీపురం రూరల్, జూలై 5 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో సుపరిపాలన తొలి అడుగు, ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమంపై టీడీపీ నాయకులతో ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర శనివారం స్థానిక పార్టీ కార్యాలయంలో సమీక్షించారు. పార్టీ పట్టణ నాయకులు, కార్యకర్తలతో సమావేశమై గత మూడు రోజులుగా చేపట్టిన కార్యక్రమంపై ఆరా తీశారు. ప్రజలు చెప్పే ప్రతి సమస్యను రికార్డు చేయాలని నాయకులకు సూచించారు.

ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయం

● ప్రభుత్వ విప్ జగదీశ్వరి



వినతులను పరిశీలిస్తున్న ప్రభుత్వ విప్ జగదీశ్వరి

గుమ్మలక్ష్మీపురం, జూలై 5 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలు పరిష్కరించడమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని ప్రభుత్వ విప్, కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి అన్నారు. శనివారం ఆమె గుమ్మలక్ష్మీపురంలోని తన క్యాంప్ కార్యాలయంలో ప్రజాదర్బార్ నిర్వహించారు. పలువురు వినతిపత్రాలు అందజేయగా, ఆమె వాటిని పరిశీలించారు. సమస్యలు పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్‌పర్సన్ కడ్రక కళావతి, జియ్యమ్మవలస ఎంపీపీ బొంగు సురేష్, నాయకులు వెంపటాపు భారతి, డి.వెంకటనాయుడు, పి.వెంకటనాయుడు, లంక గోపాలం, బి.తమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

మెరుగ్గా సేవలు అందించాలి

● పాలకొండ ఎమ్మెల్యే జయకృష్ణ



అధికారులతో మాట్లాడుతున్న జయకృష్ణ

పాలకొండ, జూలై 5 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ సేవలు ప్రజలకు మెరుగ్గా అందించాలని ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ అన్నారు. శనివారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఆయన నియోజకవర్గంలోని అధికారులతో సమీక్షించారు. ప్రభుత్వం ద్వారా ప్రజలకు అందించాల్సిన అన్ని సంక్షేమ పథకాలను ప్రజలకు చేరువ కావాలన్నారు. లబ్ధిదారుల ఎంపిక, సంక్షేమ ఫలాలు అందించడంలో అధికారులతో సమన్వయం చేసుకోవాలన్నారు. సబ్ కలెక్టర్ యశ్వంత్ కుమార్‌రెడ్డి శాఖల వారీగా సమీక్ష నిర్వహించారు. అధికారులంతా సమన్వయంతో పనిచేసి ప్రభుత్వానికి మంచి పేరు తేవాలన్నారు. మండల ప్రత్యేకాధికారి మన్మథరావు, ఎంపీపీ బొమ్మాళి భాను, వైస్ ఎంపీపీ వాకమూడి అనిల్‌కుమార్, అధికారులు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వంతోనే అభివృద్ధి



కరపత్రాలు అందిస్తున్న వీరేశ్‌దేవ్ తదితరులు

గరుగుబిల్లి, జూలై 5 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వంతోనే పూర్తిస్థాయిలో అభివృద్ధి సాధ్యమవుతుందని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వైరిచర్ల వీరేశ్‌దేవ్ అన్నారు. టీడీపీ సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా శనివారం ఆయన గరుగుబిల్లిలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. టీడీపీ రాష్ట్ర బీసీ కార్పొరేషన్ డైరక్టర్ అక్కేన మధుసూదనరావు, పార్టీ రాష్ట్ర ప్రతినిధి మర్రాపు పురుషోత్తంనాయుడు, అంబటి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో మొహర్రం



దర్గా వద్ద అలంకరిస్తున్న దృశ్యం

కురుపాం, జూలై 5(ఆంధ్రజ్యోతి): కురుపాంలో ముస్లింలు భక్తిశ్రద్ధలతో మొహర్రం పండగ నిర్వహించారు. స్థానిక మౌల ఆలి దర్గ వద్ద మత గురువు మొహమ్మద్ ఆలం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. దర్గ వద్ద ముస్లీం ఆకుపచ్చ మరాకు ఎరుపు జెండాలు అలంకరించారు.

భోజనం రుచికరంగా ఉండాలి

సీతంపేట రూరల్, జూలై 5 (ఆంధ్రజ్యోతి): ఐటీడీఏ పరిధిలోని ఆశ్రమ పాఠశాలల్లో విద్యార్థులకు పెడుతున్న భోజనం రుచికరంగా ఉండాలని ఏపీవో జి.చిన్నబాబు అన్నారు. సీతంపేట మండలంలోని ముత్యాలు ఆశ్రమ పాఠశాలను ఆయన శనివారం పరిశీలించారు. ఈసందర్భంగా ఏపీవో మాట్లాడుతూ పాఠశాల పరిసరాలు పరిశుభ్రంగా ఉండాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వండిన భోజనాన్ని రుచి చూశారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం, ఇతర ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

రైతు బజార్‌ను వినియోగంలోకి తేవాల్సిందే..

● ఏఎంసీ పాలకవర్గ మొదటి సమావేశం

సాలూరు, జూలై 5(ఆంధ్రజ్యోతి): గతంలో తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు సుమారు రూ.25లక్షలతో దండిగాం రోడ్డులో ఏర్పాటు చేసిన రైతుబజార్‌ను ఎట్టి పరిస్థితుల్లోనైనా వినియోగంలోకి తేవాల్సిందేనని ఏఎంసీ పాలకవర్గం నిర్ణయం తీసుకుంది. శనివారం స్థానిక ఏఎంసీ కార్యాలయంలో ఏఎంసీ చైర్మన్ ముఖీ సూర్యనారాయణ ఆధ్వర్యంలో పాలకవర్గం సమావేశమైంది. ఈసందర్భం గా పాలకవర్గం సమీక్షిగా కొన్ని తీర్మానాలు చేసింది. ప్రధానంగా దండిగాం రోడ్డులో సుమారు రూ.25లక్షలతో నిర్మిం చిన రైతుబజార్‌ను వినియోగంలోకి తేవాలని నిశ్చయించుకున్నారు. నియోజకవర్గం పరిధిలో ఉన్న మక్కువ, పాచిపెంట మండలాల్లో ఉన్న ఏఎంసీలకు ప్రహరీ నిర్మాణాలను చేపట్టాలని, సాలూరులో ఉన్న ఏఎంసీ ప్రహరీలకు మరమ్మతులు చేయాలని, రైతులకు గిట్టుబాటు ధర వచ్చేం తవరకు రైతులు పండించే పంటను ఉంచేందుకు నిల్వల గిడ్డంగులు ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం నుంచి నిధులు వచ్చేలా తీర్మానాలు చేశారు. వైస్ చైర్మన్ మింధి సింహాచల, సెక్రటరీ నరేష్‌కుమార్, పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.

పదోన్నతులకు అనుమతి ఇవ్వాలి



నిరసన తెలుపుతున్న ఆర్టీసీ ఉద్యోగులు, నాయకులు

పాలకొండ, జూలై 5 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ ఉద్యోగుల పదోన్నతులకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు తక్షణమే అనుమతులు ఇవ్వాలని ఎంప్లాయిస్ యూనియన్ డిపో వర్కింగ్ ప్రెసిడెంట్ వారాడ వెంకటరమణ, డిపో కార్యదర్శి ఎంవీఎస్ నారాయణ కోరారు. శనివారం స్థానిక ఆర్టీసీ డిపో ఎదుట గేట్ మీటింగ్ నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ డీఏ బకాయిలు చెల్లించాలని, ప్రమోషన్లు భర్తీ చేయాలని కోరారు. ఎలక్ట్రికల్ బస్సులు కొనుగోలు చేయాలని, పీఆర్సీ కమిషన్ వేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఆగస్టు 15 నుంచి ఉచిత బస్సు పథకం విజయవంతం కావాలంటే మూడు వేల బస్సులు కొనుగోలు చేయాలని విన్నవించారు. 12వ పీఆర్సీపై ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు ఐఆర్ ప్రకటించాలని డిమాండ్ చేశారు. విశ్రాంత ఆర్టీసీ ఉద్యోగులకు గ్రాడ్యూటీ, టెర్మినల్, ఎన్‌క్యాష్‌మెంట్‌ను ప్రభుత్వం చెల్లించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఈయూ నాయకులు పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

శాకంబరిగా కాశీ అన్నపూర్ణాదేవి



పాలకొండ, జూలై 5 (ఆంధ్రజ్యోతి): స్థానిక కాశీ అన్నపూర్ణాదేవి ఆలయంలోని అమ్మవారు శాకంబరిదేవిగా శనివారం భక్తులకు దర్శనమిచ్చారు. అర్చకులు కూర్మనాథశర్మ, ఆంజనేయశర్మ ఆధ్వర్యంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారిని వివిధ రకాల కూరగాయలు, ఆకుకూరలతో అలంకరించారు.

గిరిజన విద్యా సంస్థల్లో వసతులు మెరుగుపర్చాలి

గుమ్మలక్ష్మీపురం, జూలై 5 (ఆంధ్రజ్యోతి): పార్వతీపురం, సీతంపేట ఐటీడీఏల పరిధిలోని గిరిజన గురుకులాలు, గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో వసతులను మెరుగుపర్చాలని గిరిజన సంక్షేమ సంఘం నాయకుడు రంజిత్‌కుమార్ కోరారు. ఆయన శనివారం స్థానిక విలేకర్లతో మాట్లాడారు. వర్షాకాలంలో భద్రగిరి పీజీటీ బాలికల వసతిగృహం పూర్తిగా కారిపోతుందని తెలిపారు. ఈ పరిస్థితిని ఐటీడీఏ పీవో శ్రీవాత్సవ పరిశీలించాలని కోరారు. విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు.

ఎండీఎం నిర్వాహకుల సమస్యలు పరిష్కరించాలి

మక్కువ, జూలై 5 (ఆంధ్రజ్యోతి): మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎన్‌వై నాయుడు కోరారు. ఈ మేరకు శనివారం స్థానిక పీఎంఆర్సీ భవనంలో ఎంఈవో శ్యాంసుందర్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మధ్యాహ్న భోజన నిర్వహణ కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు అందజేయాలని, లేబర్ కోడ్ రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సీఐటీయూ నాయకుడు జి.కృష్ణారావు, ఎండీఎం కార్మిక సంఘం నాయకులు పార్వతి, రమణమ్మ పాల్గొన్నారు.

నీతి అయోగ్ అధికారిని కలిసిన కలెక్టర్

పార్వతీపురం, జూలై 5 (ఆంధ్రజ్యోతి): జిల్లాకు విచ్చేసిన నీతి అయోగ్ అడిషనల్ మిషన్ డైరక్టర్ డా.మహేంద్రకుమార్‌ను కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. పార్వతీపురం మన్యం జిల్లాను ఆశావాహి జిల్లాగా గుర్తించడం అభినందనీయమని మహేంద్రకుమార్ అన్నారు.

తొలి ఏకాదశికి తోటపల్లి సిద్ధం

గరుగుబిల్లి, జూలై 5 (ఆంధ్రజ్యోతి): చినతిరుపతిగా ప్రసిద్ధిగాంచిన తోటపల్లి శ్రీ వేంకటేశ్వర స్వామి, శ్రీ కోదండరామస్వామి దేవస్థానాలు శయన ఏకాదశికి సిద్ధమయ్యాయి. ఈ నెల 6న ఆషాఢ శుద్ధ ఏకాదశిని పురస్కరించుకుని ప్రత్యేక పూజలతో పాటు కల్యాణాలు నిర్వహించనున్నట్లు దేవస్థానం కార్యనిర్వహణాధికారి వీవీ సూర్యనారాయణ తెలిపారు. శయన ఏకాదశికి ప్రత్యేకత ఉందన్నారు. భక్తులకు అసౌకర్యం కలగకుండా అవసరమైన చర్యలు చేపట్టినట్టు ఆయన తెలిపారు.